సాక్షి నంద్యాల

శనివారం : 24 : ఫిబ్రవరి : 2024



విస్తరాకుల విరాళం

శ్రీశైలం టెంపుల్: చీరాలకు చెందిన భ్రమరాంబికా సేవా సమితి వారు శుక్రవారం అన్నప్రసాద వితరణ విభాగానికి రూ. 3 లక్షల విలువైన లక్ష విస్తరాకులను విరాళంగా అందజేశారు.



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో ఉత్సవమూర్తులను ఉంచి సహస్ర నామ పూజలు జరిపించారు.



ట్రిపుల్ఐటీలో సాలస్టా ఫెస్ట్

కర్నూలు (సిటీ): జగన్నాథగట్టులోని ట్రిపుల్ఐటీలో వార్షిక సాంస్కృతిక సాంకేతిక ఉత్సవం (సాలస్టా ఫెస్ట్) శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు వేడుక కొనసాగనుంది.

న్యూస్‌రీల్

అహోబిలేశుడికి ప్రత్యేక పూజలు



ఆర్.నాగులవరంలో ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రుద్రవరం: పార్వేట ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వామి వారికి ఆర్.నాగులవరం గ్రామస్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి పల్లకీ గ్రామంలోని తెలుపుల మీద కొలువుదీరగా గ్రామ సర్పంచు గంధం సావిత్రమ్మ, ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవ రెడ్డి కుటుంబీకులతో పాటు గ్రామస్తులు స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రూప్-2 పరీక్షకు 44 కేంద్రాలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు 44 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ తెలిపారు. శుక్రవారం డీఆర్‌ఓ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్షన్ అధికారి, లైజన్ ఆఫీసర్ పరీక్ష నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్, ఏపీఎస్పీడీసీఎల్, డీఎంఅండ్‌హెచ్ఓ తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షలు ఈనెల 25వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఉదయం 9గంటల్లోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆమె తెలిపారు.

రికవరీలపై ప్రత్యేక దృష్టి

- డీసీసీబీ నూతన సీఈఓ విజయకుమార్



నూతన సీఈఓ విజయకుమార్‌ను అభినందిస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా సహకార కేంద్రబ్యాంకును లాభాల బాట పట్టించేందుకు చర్యలు తీసుకుంటామని నూతన కార్యనిర్వహణ అధికారి(సీఈఓ) విజయకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముందుగా డీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం సమర్పించారు. నూతన సీఈఓను జీఎం పి.రామాంజనేయులు, సెలవుల్లో వెళ్తున్న సీఈఓ శివలీల, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, ఏజీఎం త్రినాథ్ రెడ్డి, చీఫ్ మేనేజర్ రాఘవేంద్ర, జిల్లా ఫ్యాక్స్ డెవలప్‌మెంట్ సెల్ మేనేజర్ నహిదా సుల్తాన అభినందించారు. అనంతరం సీనియర్ అధికారులతో సమావేశమై బ్యాంకు ప్రగతిపై నూతన సీఈఓ సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో పోలీసుల విస్తృత దాడులు

బొమ్మలసత్రం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది విస్తృతంగా వాహనాల తనిఖీలు, అసాంఘిక కార్యకలాపాలపై దాడులు చేపట్టినట్లు ఎస్పీ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అక్రమంగా నాటుసారా, మద్యం తరలిస్తున్న 21 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. వారి నుంచి 230 లీటర్ల నాటుసారా, 324 మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 1,400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు వివరించారు. నందివర్గం, బనగానపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిల్లో పేకాట స్థావరాలపై నిర్వహించిన దాడుల్లో 14 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 36 వేలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలపై రూ. 26 వేల చలనాలు విధించామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో 8 మంది పట్టుబడగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే 13 మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో 20 మందికి పైగా బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు.

వాము క్వింటా రూ. 29,012

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం వాము క్వింటా గరిష్ట ధర రూ.29,012 పలికింది. దాదాపు 1517 క్వింటాళ్లు వాము రాగా.. క్వింటాకు కనిష్ట ధర రూ.1,517, సగటు ధర రూ.2,1970 ప్రకారం లభించింది. కందులు 464 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.1,009, గరిష్ట ధర రూ.10,016, సగటు ధర రూ.9,939 లభించింది. ఎండుమిర్చి 899 క్వింటాళ్లు రాగా.. గరిష్ట ధర రూ.23,299 పలికింది.

పోషకాల విందు.. భలే పసందు



మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ

- ప్రభుత్వ బడుల్లో పకడ్బందీగా 'జగనన్న గోరుముద్ద'
- సత్ఫలితాలిచ్చిన మెనూ మార్పులు
- ఇష్టంగా తింటున్న విద్యార్థులు
- చిన్నారుల్లో తగ్గిన రక్తహీనత రుగ్మతలు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో అన్నం ఉడకలేదు.. కూర రుచిగాలేదు.. వంట శుభ్రంగా చేయలేదు.. అన్న మాటలకు ఎప్పుడో చెల్లుచీటి ఇచ్చేసింది జగనన్న ప్రభుత్వం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మధ్యాహ్న భోజనం తీరు మారింది. భావిభారత పౌరులు తినే ఆహారం బలవర్ధకంగా ఉండాలంటూ 'జగనన్న గోరుముద్ద'గా మార్చేసింది. నాణ్యతతో పాటు శుచీ, శుభ్రతకు పెద్దపీట వేయడంతో విద్యార్థులు కడుపు నిండా తింటూ శ్రద్ధగా చదువుకుంటున్నారు.



విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

ఆళ్లగడ్డ: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్న భోజనాన్ని 'జగనన్న గోరుముద్ద'గా మార్చేశారు. మెనూ నిండా రుచి, శుచితో పాటు బలవర్ధకమైన ఆహారాన్ని చేర్చి రోజుకో రకం వంటకం తయారు చేసి విద్యార్థులకు వడ్డించేలా ప్రక్షాళన చేశారు. ఓ వైపు నాణ్యతను పెంచుతూ.. మరో వైపు పర్యవేక్షణను మెరుగుపరిచి విద్యార్థులకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. దీంతో గతంలో అన్నం తినలేక బయటపడేసిన విద్యార్థులు, ఇక్కడ చేసింది తినలేక ఇంటి దగ్గర నుంచి క్యారియర్ తెచ్చుకునేవారు సైతం ఇప్పుడు తృప్తిగా ఒక్క మెతుకు కూడా వదలకుండా తింటున్నారు. ఉపాధ్యాయులు సైతం ఇక్కడే తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులు రక్తహీనతతో అనేక రకాల రుగ్మతలకు లోనై విద్యపై దృష్టి పెట్టలేక పోతున్నారని గుర్తించిన ప్రభుత్వం పౌష్టికాహారం పంపిణీకి చర్యలు తీసుకుంది. వారానికి మూడు రోజులు వేరుశనగ చెక్కీలు ఇవ్వడంతో పాటు బెల్లం, రాగి పిండితో తయారు చేసే రాగిజావను ఇవ్వడం ద్వారా అనేక మంది ఐరన్, కాల్షియం లోపాలను అధిగమించారు. ముఖ్యంగా కౌమార దశలో ఉన్న బడుగు, బలహీన వర్గాలకు చెందిన బాలికలు అనేక మంది రక్తహీనత నుంచి కోలుకోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇంటి భోజనం కన్నా రుచికరంగా ఆహార పదార్థాలు ఉండేలా అధికారుల పర్యవేక్షణ చేస్తున్నారు. వంట చేసేందుకు ఏజెన్సీలకు స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు అందజేశారు. పరిశుభ్రమైన తాగునీటికి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. మేనమామ మాదిరిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నీ సమకూర్చారని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలు	పాఠశాలల సంఖ్య	విద్యార్థులు
ప్రాథమిక	962	69,825
ప్రాథమికోన్నత	194	23,102
ఉన్నత పాఠశాలలు	285	93,408
మొత్తం	1441	1,86,335



బెల్లం, వేరుశనగ పప్పులతో చేసిన చిక్కీలు

చక్కని మెనూ..

సోమవారం:	హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, వెజిటబుల్ పలావ్, కోడి గుడ్డు కూర, చిక్కీ
మంగళవారం:	పులిహోర, టమాటా పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
బుధవారం:	వెజిటబుల్ బిర్యానీ, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
గురువారం:	లెమన్ రైస్, టమాట చెట్నీ, ఉడికించిన గుడ్డు, రాగిజావ
శుక్రవారం:	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
శనివారం:	ఆకుకూర అన్నం, పప్పు చారు, స్వీట్ పొంగల్, రాగిజావ

హిమోగ్లోబిన్ 10 పాయింట్లకు పెరిగింది



నాకు ఎప్పుడూ నీరసంగా ఉండటంతో అస్వస్థతకు లోనవుతూ చదువుపై దృష్టి పెట్టలేకపోయేదాన్ని. ఈ క్రమంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు వచ్చిన ఆరోగ్య సిబ్బంది రక్త పరీక్ష చేయడంతో నాకు కేవలం హిమోగ్లోబిన్ శాతం 4 పాయింట్లే ఉందని తెలిసింది. దీంతో అవసరమైన మందులు ఇవ్వడంతో పాటు రోజు పాఠశాలలో పెట్టే పోషక విలువలు ఉన్న భోజనం, చిక్కీలు, రాగిజావ తాగడంతో ఇప్పుడు 10 పాయింట్లకు పైగా ఉండటంతో ఆరోగ్యంగా ఉన్నా.

– భార్గవి – 9వ తరగతి, దీబగుంట్ల

అమ్మకు పనిభారం తప్పింది



నేను బాలికల ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నా. గతంలో స్కూల్‌లో వడ్డించే భోజనం రుచిపచి ఏమాత్రం లేక పోవడంతో కష్టమైన ఇంటి దగ్గర అమ్మతో క్యారేజీ కట్టించుకుని మధ్యాహ్నం తినేదాన్ని. ఇప్పుడు మధ్యాహ్న భోజనం చాలా రుచికరంగా ఉంది. రోజుకో రకం వంట, రుచి, శుభ్రతతో పౌష్టికాహారం ఇస్తున్నారు. ఇంట్లో కూడా ఇంత రుచిగా ఎప్పుడు ఉండదు. రోజూ ఇక్కడే ఎంతో ఇష్టంగా భోజనం చేస్తున్నారు. దీంతో పొద్దున్నే లేచి వంట చేసి క్యారేజి కట్టే పని భారం అమ్మకు తప్పింది.

– సంధ్య, మందలూరు

టీడీపీ ప్రభుత్వంలో అలా..



నాడు.. ఉడకని అన్నం, నీళ్ల సాంబారు

- టీడీపీ ప్రభుత్వం హయాంలో నాణ్యమైన బియ్యం అందించక పోవడంతో పాటు ఏజెన్సీలకు ఇచ్చే డబ్బులు అరకొరగా ఇవ్వడంతో మధ్యాహ్న భోజన పథకం అమలు అస్తవ్యస్తంగా ఉండేది.
- ప్రైమరీ విద్యార్థికి రూ. 4.37, హైస్కూల్ విద్యార్థులకు రూ. 6.51 చొప్పున ఇస్తూ పప్పు, నూనె, గుడ్ల సరఫరాను కాంట్రాక్టర్లకు అప్పగించారు.
- ఇచ్చే అరకొర మొత్తంలోనే గుడ్డుకు రూ. 2.35 పైసలు, పప్పుకు రూ. 2.07 పైసలు, నూనె రూ. 0.87 పైసలు చొప్పున కాంట్రాక్టర్లకు (టీడీపీ నాయకులకు) మినహాయించుకుని మిగిలిన డబ్బులు మాత్రమే నిర్వాహకులకు ఇచ్చేవారు.
- నిర్వాహకులకు కేవలం ఒక్కో విద్యార్థిపై రూ. 3.24, ప్రాథమిక విద్యార్థులకైతే రూ.1.41 మాత్రమే అందేవి. ఆ బిల్లులు కూడా ఏళ్ల తరబడి రాని దుస్థితి.
- వంట సహాయకులకు గౌరవ వేతనం రూ. 1000 మాత్రమే.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఇలా..

- మధ్యాహ్న భోజనం నిర్వహణ ఖర్చులు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వంట ఏజెన్సీ నిర్వాహకులకు మంచిరోజులు వచ్చాయి.
- పప్పు, నూనె డబ్బులు కలుపుకుని మొత్తంగా ప్రైమరీ విద్యార్థికి రూ. 5.88, హైస్కూల్ విద్యార్థికి రూ. 8.57 చెల్లిస్తున్నారు.
- గుడ్డు మినహా పప్పు, నూనె, కూరగాయలు, ఆకు కూరలు మిగతా వస్తువులు అన్నీ నిర్వాహకులే తాజాగా కొనుగోలు చేసుకునే వెసలుబాటును ఏజెన్సీ నిర్వాహకులకే కల్పించింది.
- ప్రతిరోజు గుడ్డుతో కూడిన రోజుకో మెనూతో శుచి.. శుభ్రతతో కూడిన పౌష్టికాహారంతో పాటు అదనంగా వారానికి మూడు రోజులు చిక్కీలు, రాగిజావ అందిస్తున్నారు.
- వంట సహాయకులకు గౌరవ వేతనం రూ. 3 వేలకు పెంచారు.

జల చౌర్యానికి పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ మల్లికార్జున రెడ్డి

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణ వాసుల దాహార్తిని తీర్చేందుకు వెలుగోడు నుంచి కేసీ కెనాల్ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని అనధికారికంగా ఎవరైన మళ్లిస్తే చర్యలు తప్పవని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నంద్యాల పట్టణ ప్రజలకు నీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగాగా ఆర్డీఓ మల్లికార్జున రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణానికి కేవలం 20 రోజులకు సరిపడ నీరు మాత్రమే ఉందని, వెలుగోడు నుంచి నంద్యాలకు కేసీ కెనాల్ ద్వారా తీసుకు వస్తున్న నీటిని మార్గ మధ్యలో కొందరు రైతులు పొలాలకు మళ్లించుకుంటున్నారన్నారు. ఈ విషయాన్ని ఇదివరకే జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసు, విద్యుత్ శాఖ, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కేసీ కెనాల్ వెంట పెట్రోలింగ్ చేసి నీటి చౌర్యాన్ని అరికట్టేందుకు తనిఖీలు చేపట్టారన్నారు. పట్టణ ప్రజలు నీటి వృథాను అరికట్టాలని సూచించారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



అన్నప్రసాద వితరణ గురించి భక్తులను అడిగి తెలుసుకుంటున్న ఈఓ

శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ డి.పెద్దిరాజు అన్నారు. ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా శుక్రవారం ఆయన స్థానిక అన్నప్రసాద వితరణ భవనాన్ని పరిశీలించారు. అన్నదాన భవనంలోని భక్తులు వేచి వుండే గదులు, వంటశాల, భోజనశాల మొదలైన వాటిని ఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీకనుగుణంగా అన్నప్రసాద వితరణను నిరంతరం కొనసాగించాలన్నారు. సాధారణ భక్తులు, శివ దీక్షా స్వాములు, ఉత్సవాలలో ప్రత్యేక విధులు నిర్వహించేందుకు వచ్చే సిబ్బందికి, ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యే కళాకారులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్నప్రసాదం పంపిణీ జరగాలన్నారు. అన్నదాన భవన హాల్‌లో కూలర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల సమయంలో క్షేత్రపరిధిలో అన్నదాన కేంద్రాలు నిర్వహించే స్వచ్ఛంద సంస్థలకు దేవస్థానం నుంచి పూర్తి సహాయ సహకారాలను అందించాలని ఆదేశించారు.

రేనాటి వీరుడు నిత్య స్మరణీయుడు



ఎయిర్‌పోర్టు వద్ద ఆవిష్కరించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన, ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని

- ఎయిర్‌పోర్టు వద్ద నరసింహారెడ్డి, మహానేత వైఎస్సార్ విగ్రహాల ఆవిష్కరణ
- పాల్గొన్న మంత్రి బుగ్గన, ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నిత్య స్మరణీయుడని రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఓర్వకల్లు ఎయిర్ పోర్టు వద్ద కార్పొరేషన్ సోషల్ రెస్పాండ్(సీఎస్ఆర్) నిధులు రూ. కోటితో నిర్మించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, దివంగత నేత వైఎస్ రాజశేఖరెడ్డి విగ్రహాలను మంత్రి బుగ్గనతో పాటు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. కరువు ప్రాంతమైన రాయలసీమ రైతుల నుంచి పన్ను వసూలు చేయడాన్ని నిరసిస్తూ తెల్లదొరలకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాటం చేశారన్నారు. పోరాటంలో తన ఆస్తిని పేదలకు ధారాదత్తం చేశారని కొనియాడారు. కుట్రపూరితంగా తెల్లదొరలు నరసింహారెడ్డిని హత్య చేశారని, ఆయన పోరాటం చిరస్మరణీయమైనదన్నారు. ఆ ఉద్యమకారుడి జ్ఞాపకార్థం ఎయిర్ పోర్టు ముఖద్వారం వద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.

మహానేత చలువతో సీమకు సాగునీరు

మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చలువతోనే రాయలసీమ ప్రజలకు సాగునీరు అందుతోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గోరుకల్లు, గాలేరు-నగరి ప్రాజెక్టులను నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందజేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కిందన్నారు. రైతులకు చేసిన మేలును మరిచి పోకూడదనే ఉద్దేశంతో మహానేత విగ్రహాన్ని ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమ

ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోని గుమ్మితం తండా, పిన్నాపురం గ్రామాల మధ్య దాదాపు 3 వేల ఎకరాల్లో బహుళార్థక సోలార్ ప్రాజెక్టును నిర్మించడం సంతోషదాయకమని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రూ. 15వేల కోట్ల వ్యయంతో ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమ నెలకొల్పుతున్నట్లు తెలిపారు. ఒకే ప్రాంతంలో జల, సౌర, పవన విద్యుత్ పరిశ్రమలను నెలకొల్పడంతో రాష్ట్రంలో విద్యుత్ కొరతను అధికమించవచ్చని అభిప్రాయపడ్డారు. మహనీయుల విగ్రహాలను స్థాపించేందుకు సహకరించిన ఎయిర్ పోర్టు అధికారులు, గ్రీన్‌కో యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, గ్రీన్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపీడీ శ్రీనివాసనాయుడు, హోమియోపతి వైద్యులు డాక్టర్ భాస్కర్‌రెడ్డి, పాణ్యం భద్రినాథ్, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు, చిత్రంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఆర్‌ఓ పద్మజ

నంద్యాల: సాధారణ ఎన్నికల విధుల్లో ఉండే అధికార యంత్రాంగం తప్పనిసరిగా భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను పాటించాలని కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో సాధారణ ఎన్నికలు 2024లో భాగంగా ఎంసీసీటీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటి, ఎఫ్ఎస్‌టీ టీంలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై కచ్చితమైన నిఘా ఉంచి ప్రతి విషయాన్ని నమోదు చేసుకోవాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా టీంలను ఏర్పాటు చేశామని, జిల్లా స్థాయిలో ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో పూర్తి అవగాహన పొంది ప్రతి సందేహాన్ని నివృత్తి చేసుకోవాలన్నారు. సివిజిల్ యాప్, ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల్లో మద్యం, డబ్బు, ఇతర వస్తువులు రవాణా కాకుండా ఐటీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ సాధారణ ఎన్నికల సమయంలో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు ఎంసీసీటీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటి, ఎఫ్ఎస్‌టీ టీం అధికారులు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల నోటిఫికేషన్ నుంచి అమలులో ఉంటుందని, ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. తాము అధికారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ఎలాంటి సమస్యలు, సందేహాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. శిక్షణలో డీఆర్‌ఓ ఎ. పద్మజ, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఆర్‌జేడీ రాఘవరెడ్డి



ఆర్‌జేడీ రాఘవరెడ్డికి బొకే అందజేస్తున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, ఎంఈఓలు, అధికారులు చొరవ చూపాలని విద్యాశాఖ ఆర్‌జేడీ రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణ సమీపంలోని ఎస్‌వీఆర్ కళాశాలలో డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో హెచ్ఎంలు, ఎంఈఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు సబ్జెక్టుల వారీగా సిలబస్‌ను తగిన సమయంలో పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ఎంఈఓలు, హెచ్ఎంలపై ఉందన్నారు. విద్యాభివృద్ధిని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ట్యాబ్‌లు అందించిందన్నారు. నాడు-నేడు పథకం కింద రూ. కోట్లు ఖర్చు పెడుతుందన్నారు. సమావేశంలో డీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ డీఈఓ బేగ్, ఎస్ఎస్ఏ అధికారి లలిత, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్ట్

- గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులకు పట్టుబడిన ఏడుగురు
- 6.5 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అన్బురాజన్


అనంతపురం: జిల్లాలో మరో గంజాయి ముఠా గుట్టురట్టు అయింది. గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని శుక్రవారం గుంతకల్లు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 6.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్పీ అన్బురాజన్ వెల్లడించారు. గుంతకల్లులోని షికారీ కాలనీకి చెందిన నాగు, షికారి మంజుల, బుక్కరాయసముద్రం మండలం రాఘవేంద్ర కాలనీకి చెందిన నిస్సార్ అహమ్మద్, అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల గ్రామానికి చెందిన మేకల ప్రసాద్, కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం రచ్చుమర్రికి చెందిన నరసప్ప, కోసిగి మండలం పల్లెపాడుకి చెందిన ఎర్రతోట లక్ష్మన్న, పోయింటి ఈరన్న ముఠాగా ఏర్పడి గంజాయి విక్రయాలకు తెరలేపారు. ముఠాలోని ఎర్రతోట లక్ష్మన్న, పోయింటి ఈరన్న నుంచి షికారి నాగు, నరసప్ప, నిస్సార్ అహమ్మద్, మేకల ప్రసాద్, షికారి మంజుల గంజాయి కొనుగోలు చేసేవారు. కిలో రూ.11వేలతో కొనుగోలు చేసి 300 ప్యాకెట్లుగా మార్చి ఒక్కో ప్యాకెట్‌ను రూ.150 చొప్పున విక్రయాలు చేసేవారు. గుంతకల్లు, అనంతపురం, బుక్కరాయసముద్రం, గుత్తి, తదితర ప్రాంతాల్లో వీరు గంజాయి విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఈ నేపథ్యంలో జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా వేసిన ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు గుంతకల్లు డీఎస్పీ శివ భాస్కరరెడ్డి పర్యవేక్షణలో గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, సిబ్బంది మూర్తి, లక్ష్మీనారాయణ, శివ, రమేష్ ప్రత్యేక బృందంగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేపట్టారు. శుక్రవారం ఉదయం గుంతకల్లు షికారి కాలనీ సమీపంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న షికారి నాగు, నరసప్ప, నిస్సార్ అహమ్మద్, మేకల ప్రసాద్, షికారి మంజులను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో గంజాయి అంశం వెలుగు చూసింది. వారి నుంచి సమాచారం రాబట్టుకుని గుంతకల్లులోని ఆలూరి రోడ్డులో ఎర్రతోట లక్ష్మన్న, పోయింటి ఈరన్నను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి, 6.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ముఠా అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ రామసుబ్బయ్య, సిబ్బంది బృందాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

వాహనాల వేలంలో రూ. 2.18 లక్షల ఆదాయం

బొమ్మలసత్రం: నంద్యాల సెబ్ పోలీస్‌స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వాహనాల వేలంలో రూ. 2.18 లక్షల ఆదాయం లభించింది. సీఐ విశ్వనాథరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు సెబ్ పోలీస్‌స్టేషన్‌లో వేలం పాట నిర్వహించామన్నారు. ఈ వేలం పాట ద్వారా ప్రభుత్వానికి రూ. 2.18 లక్షల మేర ఆదాయం లభించిందని వివరించారు. ఈ కేసుల్లో పట్టుబడిన 373 లీటర్ల నాటుసారా, 60 లీటర్ల ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని ధ్వంసం చేశామని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సన్నద్ధత

- జిల్లాలో 69 కేంద్రాల ఏర్పాటు
- 8 కేంద్రాలకు ప్రత్యేక రవాణా సదుపాయం
- ప్రతి కేంద్రంలో బెంచీల ఏర్పాటు
- పరీక్షలకు హాజరుకానున్న 47,412 మంది విద్యార్థులు



కర్నూలు సిటీ: ప్రాక్టికల్ పరీక్షలు పూర్తికావడంతో మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు బోర్డు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. పరీక్షల నిర్వహణకు సిబ్బందిని ఎంపిక చేస్తున్నారు. అవసరమైన చోట హైస్కూల్ ఉద్యోగులను వినియోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 69 కేంద్రాలను ఎంపిక చేశారు. ఆయా కేంద్రాల్లో సదుపాయలను సైతం సమకూర్చుతున్నారు. మొదటి సంవత్సర పరీక్షలకు 20,258 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 23,025 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల్లో చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి కేంద్రంలో బెంచీలను ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షల్లో ఎక్కడ అక్రమాలకు అస్కారం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి కేంద్రంలో గది గదికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలను సీసీ కెమెరాల ద్వారా జిల్లా కేంద్రం నుంచి జోనల్, రాష్ట్ర స్థాయి ఇంటర్మీడియట్ కార్యాలయం వరకు పర్యవేక్షణ చేసేందుకు లైవ్‌స్ట్రీమ్ సదుపాయాలను కల్పించారు. పరీక్షల సమయానికి పిల్లలు చేరుకునే విధంగా రవాణా సదుపాయాలను కల్పించారు. జిల్లాలో 8 కేంద్రాలకు పరీక్షలు మొదలు అయ్యే సమయానికి రవాణా సదుపాయాలు లేకపోవడంతో ఏపీ ప్రజా రవాణా సంస్థ అధికారులతో మాట్లాడి బస్సులను ఏర్పాటు చేశారు.

సమస్యాత్మకమైన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

కర్నూలు జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన జూనియర్ కాలేజీలు మొత్తం 194 ఉన్నాయి. వీటిలో 157 కాలేజీలు పని చేస్తున్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 23, ఏపీ మోడల్ స్కూళ్ల కాలేజీలు 16, ఎయిడెడ్ కాలేజీలు 04, ఏపీ సోషల్ వెల్ఫేర్ కాలేజీలు 8, ఏపీ రెసిడెన్షియల్ కాలేజీలు 02, కస్తూర్బాగాంధీ విద్యాలయాలు 26, మహాత్మజ్యోతి రావు పూలే 1, ప్రైవేటు కాలేజీలు 77 ఉన్నాయి. ఇందులో ఐదు సమస్యాత్మకమైన కేంద్రాలుగా గుర్తించారు. ఉన్నత పాఠశాలల్లో ఐదు చోట్ల, డిగ్రీ కాలేజీల్లో 5 చోట్ల పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం దగ్గర 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో కరెంట్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకునేలా సమన్వయ కమిటీ సమావేశంలో అధికారులు సూచనలు చేశారు. గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆలూరు, పత్తికొండ, దేవనకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గతంలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు అయినందుకు సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. కోసిగి, చిప్పగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మాల్ ప్రాక్టిస్ ఎక్కువగా జరిగిన సందర్భాలు ఉండడంతో అత్యంత సమస్యాత్మక కేంద్రాలు గుర్తించారు. ఆరికెర ఏపీ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీ నుంచి ఆలూరుకు, ఆరేకల్లు ఏపీ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీ నుంచి బనవాసికి, ఆరేకల్లు మహాత్మజ్యోతిరావు పూలే జూనియర్ కాలేజీ నుంచి బనవాసికి, జూలకల్లుఏపీ మోడల్ స్కూల్ నుంచి గూడూరుకు, సి.బెళగల్ ఏపీ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీ నుంచి గూడూరుకు, నాగులదిన్నె ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి మంత్రాలయానికి, కడివెళ్ల, పెద్దకడబూరు ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీల నుంచి ఎమ్మిగనూరులలోని కేంద్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

వైభవంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ దృశ్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహా క్షేత్రంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం సంప్రదాయబద్ధంగా నిర్వహించింది. సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహా మంగళహారతుల అనంతరం గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ మహా ద్వారం నుంచి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాళమ్మ ఆలయం, నందిమండపం, గంగాసదనం మీదుగా బయలు వీరభద్రస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. బయలు వీరభద్రస్వామి ఆలయం నుంచి అలంకారేశ్వర ఆలయం మీదుగా వలయ రహదారిపైకి చేరుకుంది. అక్కడి నుంచి సారంగధర మఠం మీదుగా సాగి హేమారెడ్డి మల్లమ్మ మందిరం వద్దకు అక్కడి నుంచి మహిషాసురమర్దిని, రుద్రాక్షమఠం, విభూతిమఠాల మీదుగా రుద్రవనంలోకి చేరుకుంది. రుద్రవనం నుంచి నందిమండపం వద్దకు రావడంతో ఈ గిరి ప్రదక్షిణ ముగిసింది.

నేడు ఉప లోకాయుక్త ప్రమాణస్వీకారం

కర్నూలు(సెంట్రల్): ఉప లోకాయుక్తగా పగిడి రజని శనివారం ఉదయం 11 గంటలకు లోకాయుక్త కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇటీవల ఆమెను ఉప లోకాయుక్తగా ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె శనివారం బాధ్యతలు తీసుకోనున్నారు.

మహానంది ఉత్సవ అధికారిగా గురు ప్రసాద్

కర్నూలు కల్చరల్: శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మహానంది దేవస్థానం ఫెస్టివల్ స్పెషల్ ఆఫీసర్‌గా దేవదాయ శాఖ కర్నూలు డివిజన్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురు ప్రసాద్, యాగంటి ఉమా మహేశ్వర దేవస్థానం ఫెస్టివల్ స్పెషల్ ఆఫీసర్‌గా జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి పాండురంగారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. శివరాత్రి పండుగ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, వసతుల కల్పనను వీరు పర్యవేక్షిస్తారు.

జిల్లా కలెక్టరు (పంచాయితీ విభాగము) వారి కార్యాలయము, నంద్యాల

షార్ట్ టెండరు నోటీసు

రిక.నెం. 183/పం.ఎ1/2024 తేది: 23-02-2024

2024 సంవత్సరము మహా శివరాత్రి బ్రహ్మోత్సవముల సందర్భముగా తేది: 01-03-2024 నుండి 11-03-2024 వరకు శ్రీశైలములో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమము చేపట్టుటకు అవసరమైన పారిశుధ్య కార్మికులను సరఫరా చేయుటకు, పోగైన వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించుటకు అవసరమైన ట్రాక్టర్లను సరఫరా చేయుటకు మరియు పారిశుధ్య కార్మికులకు టీ.షర్టులు (యూనిఫారం) సరఫరా చేయుటకు టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు షెడ్యూలు జిల్లా పంచాయతి అధికారి వారి కార్యాలయములో తేది: 24-02-2024 ఉ॥ 10.30ల నుండి తేది: 27-02-2024 మ॥ 1.00ల వరకు పొందవచ్చును. మరియు 27-02-2024 సా॥ 4.00 ల లోపల టెండర్లు దాఖలు చేయవలెను. తేది: 27-02-2024 సాయంత్రము 5.00 లకు టెండర్లు తెరువబడును. టెండరు ఖరారు చేయుటకు, రద్దు పరచుటకు జిల్లా కొనుగోలు కమిటీ వారు సర్వహక్కులు కలిగి ఉందురు. నిబంధనలు షెడ్యూలులో కనబరచబడినవి. ఇతర వివరములు, కార్యాలయపు వేళలలో జిల్లా గ్రామ పంచాయతి అధికారి, నంద్యాల వారి కార్యాలయములో పొందవచ్చును.

క్ర.నెం.	వివరములు	తేది	సరఫరా చేయవలసిన సంఖ్య	టెండరు డిపాజిట్
1	పారిశుధ్య కార్మికులు (రవాణా ఛార్జీలు, భోజనవసతి కలిపి)	తేది:01-03-2024, 02-03-2024 మరియు 11-03-2024-3 రోజులు	400 మంది	రూ.1,00,000-00
		తేది: 03-03-2024 నుండి 10-03-2024 - 8 రోజులు	1000 మంది	
2	ట్రాక్టర్లు (డీజిల్,డ్రైవర్ బత్తా మరియు 10 (5+5) మంది లోడర్లు కలిపి	తేది:01-03-2024, 02-03-2024 మరియు 11-03-2024-3 రోజులు	06 ట్రాక్టర్లు	రూ.50,000-00
		తేది: 03-03-2024 నుండి 10-03-2024 - 8 రోజులు	12 ట్రాక్టర్లు	
3	టీ షర్టులు (పారిశుధ్య కార్మికులకు యూనిఫారం)	- -	1120 యూనిఫారంలు (టీ షర్టులు)	రూ.10,000-00

సం/- టి.రాహుల్ కుమార్ రెడ్డి,
సంయుక్త కలెక్టరు & జిల్లా కొనుగోలు కమిటీ ఛైర్మెన్, నంద్యాల

సేవామార్గంలో ఎస్‌బీఐ



ఆహోబిలం దేవస్థానానికి మినీబస్సు కోసం రూ.10.95 లక్షల చెక్ అందజేస్తున్న సీజీఎం నవీన్ చంద్ర ఝూ

కర్నూలు(అగ్రికల్చర్): భారతీయ స్టేట్ బ్యాంకు సేవా మార్గంలో ముందుకు సాగుతోందని ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్‌చంద్ర ఝూ తెలిపారు. శనివారం ఆయన కర్నూలులో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆహోబిలం దేవస్థానానికి ఎస్‌బీఐ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కింద మినీ ఎలక్ట్రికల్ బస్సు కోసం రూ.10,95,322 చెక్‌ను అందజేశారు. నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఎక్విప్‌మెంట్ కోసం రూ.14,50,976 ఆర్థిక సహాయాన్ని ఇచ్చారు. కడపలోని యోగి వేమన యూనివర్సిటీకి బస్సు కోసం రూ.26,43,970, కర్నూలు ట్రిపుల్‌ఐటీ డీఎం టెక్నో కల్చరల్ ఫెస్ట్‌కు రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతం ఆయన మాట్లాడుతూ.. ఎస్‌బీఐ సీఎస్ఆర్ అమరావతి సర్కిల్ ద్వారా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ అమరావతి.. కర్నూలు నగర శివారులోని షిరిడీ సాయి వృద్ధాశ్రమానికి ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ తరుపున రూ.లక్ష విలువ చేసే ఫ్రిడ్జ్, ఫ్యాన్‌లు, గీజర్, కుర్చీలు పంపిణీ చేసింది. ఈ మేరకు క్లబ్ అధ్యక్షురాలు మంజూశర్మ రూ.లక్ష చెక్ అందచేశారు. కార్యక్రమాల్లో ఎస్‌బీఐ పరిపాలన కేంద్రం డీజీఎం లేఖామీనన్, చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు ఆదర్శప్రాయులు

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: సమాజహితం కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టే ఆర్యవైశ్యులు అందరికీ ఆదర్శప్రాయుల ని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పాతబస్టాండ్, కొత్తబస్టాండ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మగాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాల ను శుక్రవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట్రికె హరికిషన్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌తో కలిసి ప్రారంభించారు. అంతకుముందు మంత్రి బుగ్గన స్థానిక అమ్మవారిశాలలో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నకేశవయ్యగౌడ్, ఎంపీపీ రేగటి రాజశేఖరరెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైఎస్ఆర్‌సీపీకి చెందిన కౌన్సిలర్లతో పాతపేట, కొత్తపేట, పాతబస్టాండ్ కొత్తబస్టాండ్‌ల మీదుగా మంత్రి పాదయాత్ర చేశారు. మంత్రి వెంట వ్యవసాయ సలహామండలి చైర్మన్‌లు చంద్రన్న యాదవ్, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, ప్యాపిలి ఎంపీపీ గోకుల్ లక్ష్మి, బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, పార్టీ మండల శాఖ అధ్యక్షులు దొరపల్లె చిరంజీవి, బోరా మల్లికార్జునరెడ్డి, తిరుమలేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ శివలక్ష్మి, పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు పోస్టుప్రసాద్, కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సీమ సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు తిరునాంపల్లె తిరమలరెడ్డి, పార్టీ నాయకులు దినేష్‌గౌడ్, ఆర్ఈ రాజవర్ధన్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతిపిత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ఏపీజీబీ సమ్మె విజయవంతం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు శాఖల్లో లావాదేవీలు స్తంభించి పోయాయి. శుక్రవారం కర్నూలు జిల్లాలోని 61, నంద్యాల జిల్లాలోని 60 ఏపీజీబీ శాఖలు ఒక్క రోజు సమ్మెలో భాగంగా బంద్ పాటించాయి. ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోషియేషన్(ఏఐఆర్ఆర్‌బీఈఏ) పిలుపు మేరకు సమ్మె జరిగింది. ఈ సందర్భంగా కర్నూలులోని ఏపీజీబీ రీజినల్ కార్యాలయం ఎదుట బ్యాంకు అధికారులు, ఉద్యోగులు దర్నా కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టారు. ఏఐఆర్ఆర్‌బీఈఏ సెంట్రల్ కమిటీ సభ్యుడు మంజునాథ్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హనుమంతురెడ్డి మాట్లాడుతూ..దేశంలోని అన్ని గ్రామీణ బ్యాంకులను కలిపి జాతీయ గ్రామీణ బ్యాంకు(ఎన్ఆర్‌బీఐ) ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారుల సంఘం ప్రాంతీయ కార్యదర్శి రవితేజ, ఏఐబీఈఏ జిల్లా కన్వీనర్ నాగరాజు, అధికారుల సంఘం నాయకుడు రియాజ్, జీవిత బీమా ఉద్యోగుల సంఘం నాయకుడు రఘుబాబు, సీఐటీయూ నాయకులు అంజిబాబు, కెనరాబ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు పుష్పక్, యూనియన్ బ్యాంకు నాయకులు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ పురపాలక సంఘము

బహిరంగ వేలము నోటీసు

ఆర్.ఓ.నెం.78/2017/ఎ1 తేది: 21.02.2024

2024-2025 ఆర్థిక సంవత్సరమునకు గాను ఆళ్లగడ్డ పురపాలక సంఘము నందు ఈ దిగువ కనబరచిన మార్కెట్లకు సంబంధించి రుసుము వసూలు చేసుకొను హక్కునకు గుత్తకు ఇచ్చుటకు గాను తేది 28-02-2024వ తేది బుధవారము ఉదయము 11:00 గంటలకు పురపాలక సంఘ కార్యాలయము నందు గజెట్‌లోని షరతుల మేరకు కమిషనర్ గారిచే లేదా వారి అధికారము పొందిన వారిచే బహిరంగ వేలము వేయబడును.

నెం.	గుత్త వివరము	వేలము సమయములో ముందుగా చెల్లించవలసిన డిపాజిట్లు	హాజరు పరచవలసిన సాల్వెన్సీ సర్టిఫికెట్	బ్యాంకు గ్యారంటీ /పూచీకత్తు	గుత్త కాలము	కేంద్ర ప్రభుత్వ సేవా పన్ను (GST)
1	దిన మార్కెట్	5,00,000	5,00,000	5,00,000	వేలముఖాయపరిచిన తేది నుండి 31-03-2025 వరకు	18%
2	వారపు సంత మార్కెట్	5,00,000	5,00,000	5,00,000	వేలముఖాయపరిచిన తేది నుండి 31-03-2025 వరకు	18%
3	వాహనముల మెట్టు/బస్టాండ్	10,00,000	10,00,000	10,00,000	వేలముఖాయపరిచిన తేది నుండి 31-03-2025 వరకు	18%
4	జంతు వధశాల మరియు మాంసపు మార్కెట్	3,00,000	3,00,000	3,00,000	వేలముఖాయపరిచిన తేది నుండి 31-03-2025 వరకు	18%


వేలం పాటలలో పాల్గొనదలచినవారు పైన తెల్పిన **ధరావత్తు డి.డి లేదా నగదు రూపములో కమీషనరు పురపాలక సంఘము వారికి చెల్లించి పాల్గొనవలెను. బ్యాంకు చెక్కులు అనుమతించబడవు.** సాల్వెన్సీ సర్టిఫికెట్, మరియు ధరావత్తు బ్యాంకు గ్యారంటీ /పూచీకత్తు చెల్లించనిదే వేలం పాటలలో పాల్గొనుటకు అర్హులు కాదు. వేలం పాటలలో పాల్గొను వారు గతములో కాంట్రాక్టులలో క్రమముగా నెరవేర్చక పోయినచో, ప్రస్తుతము పూర్తి బకాయిలు చెల్లించిన పిదపనే వేలములో పాల్గొనవలయును. ఏదేని బకాయి వున్నచో వేలము యందు పాల్గొనుటకు అర్హత ఉండదు.

గమనిక: పై వేలమునకు సంబంధించి నిబంధనలు గజెట్‌ను రూ. 100/- చెల్లించి మునిసిపల్ కార్యాలయము నందు పొందవలెను.

సం/- కమీషనరు, ఆళ్లగడ్డ పురపాలక సంఘము

వేదాల పరిరక్షణకు కృషి

- కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామిజీ



అనుగ్రహభాషణ చేస్తున్న కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామిజీ

శ్రీశైలం: నాలుగు వేదాల పరిరక్షణలో శ్రీదేవి వేద విద్యాలయం కృషి చేస్తుందని కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామిజీ అన్నారు. వేదాలు, శాస్త్రాలు, ఆగమాలు విడివిడిగా ఉండవని, ఈ శాస్త్రాలని అధ్యయనం చేయడం వల్లనే వేదాలను పరిరక్షించినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. శుక్రవారం శ్రీశైలంలోని వేద విద్యాలయాన్ని పరిశీలించిన అనంతరం స్వామీజీ.. పక్కనే ఉన్న శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించి అనుగ్రహ భాషణం చేశారు. వేదాల పరిరక్షణకు దక్షిణ భారత దేశంలోశ్రీశైల మహాక్షేత్రం, ఉత్తర భారత దేశంలోకాశి క్షేత్రం ఉన్నత స్థితిలో వెలసిల్లుతున్నాయన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఉన్న వేద పాఠశాల వారంతా సంఘటితమై శ్రీశైలంలో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి అభిప్రాయాలను ఇచ్చి పుచ్చుకోవడం ద్వారా మంచి జరుగుతుందన్నారు. శ్రీదేవి వేద విద్యాలయంలో నాలుగు దశాబ్దాలలో అనేక మంది వేద విద్యార్థులు వివిధ ధార్మిక సంస్థలు, వేద పాఠశాలలు, వేద పరిరక్షణ అంశాలను బోధిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది మూడు రోజుల పాటు శ్రీదేవి వేదవిద్యాలయం స్వర్ణోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించాలని సంకల్పించినట్లు మేనేజింగ్ కమిటీ ట్రస్టీ కాశి విశ్వనాథశర్మ, జాయింట్ మేనేజింగ్ ట్రస్ట్ అప్పరావులు స్వామిజీకి విన్నవించారు. పీఠాధిపతి వెంట మేనేజర్ కృష్ణ, వేదపాఠశాల విద్యార్థులు, భక్తులు ఉన్నారు.

దొంగనోట్ల చలామణి కేసులో నిందితులకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): దొంగనోట్ల చలామణి కేసులో ఇద్దరు నిందితులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి శుక్రవారం తీర్పు ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 2017 జనవరి నెలలో స్థానిక ఎస్పీజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో కౌంటర్‌లో నిందితులు దూదేకుల రాజు, దూదేకుల శ్రీనివాసులు రూ.100 దొంగనోట్లను చలామణి చేశారు. వెంకట మణికంఠ అనే వ్యక్తికి అనుమానం రావడంతో త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. కేసు విచారణలో భాగంగా నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం

డోన్ రూరల్: ఓబులాపురం గ్రామం వద్ద శుక్రవారం ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన మధు (45) ట్రాక్టర్‌లో ప్యాపిలి నుంచి ఇటుకల లోడుతో వస్తుండగా ఓబులాపురం వద్ద జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మధు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమయంలో ట్రాక్టర్‌లో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- అడిషనల్ ఎస్పీ ప్రవీణ్

నంద్యాల(న్యూటౌన్): చదువుతో పాటు క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నంద్యాల అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని రామలింగారెడ్డి డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో 52వ రాష్ట్ర మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. 12 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో హాకీ రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజు, అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ క్రీడలు ప్రతిభ చాటితే ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయన్నారు. జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నంద్యాల మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్‌కుమార్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, కర్నూలు ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, రామాంజనేయులును ధాకర్, మహబూబ్‌బాషా, రాజ్‌కుమార్‌రెడ్డి, సుధీర్, గంగాధర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో గౌరవవందనం స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ, పాల్గొన్న క్రీడాకారులు

ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: పదేళ్ల తర్వాత ఇంటి స్థలంపై అన్ని హక్కులు ఉండేలా లబ్ధిదారులకు ఉచితంగా స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్స్ అందజేశామని కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద పేదల పేరిట రిజిష్టర్ చేసిన 8వేల ఇళ్ల పట్టాలను పేద అక్కచెల్లెమ్మలకు సంపూర్ణ హక్కు కల్పిస్తూ భూబదిలీ పత్రాలు జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు పంపిణీ చేశారు. శుక్రవారం ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నిరుపేదలకు రిజిస్టర్ చేసిన ఇంటి స్థలం కన్వేయన్స్ డీడ్స్, ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎంఎస్‌ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ ఖాజీ అబుల్ కలాం తదితరులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పేద అక్కచెల్లెమ్మల సొంతింటి కలను సాకారం చేస్తూ ఇళ్ల పట్టాలు అందించడమే కాకుండా ఆ స్థలాలపై సర్వ హక్కులను ప్రభుత్వం లబ్ధిదారులకు కల్పించిందన్నారు. కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ ఖాజీ అబుల్ కలాంలు లబ్ధిదారులకు రిజిస్టర్ చేసిన కన్వేయన్స్ డీడ్స్, ఇళ్ల పట్టాల పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ మల్లికార్జున రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

వైభవంగా భీష్మ ఏకాదశి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో కొలనుభారతిదేవి అమ్మవారు

కొత్తపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతి దేవి ఆలయంలో శుక్రవారం భీష్మ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కాకనూరు శ్రీ శారద పీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి పూజలు ఘనంగా చేపట్టారు. అమ్మవారికి మంగళవాయిద్యాల నడుమ పంచామృత అభిషేకం, అలంకరణ మహా నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపతి, చండీ, మహా సరస్వతీ హోమాలను భక్తిశ్రద్ధలతో చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ వెంకటనాయుడు, కర్నూలు జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, గీతా ప్రచారకులు మాడుగుల నాగేంద్ర శర్మ, మద్దయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు. కరిమద్దెల, కానాల, పార్నపల్లె, కాకనూరు, నంద్యాల, యంబాయి, తూడిచెర్ల, దుద్యాల, గ్రామాల వారి చెక్కభజనలు ఆకట్టుకున్నాయి.



హోమాలు చేస్తున్న కాకనూరు శ్రీ శారదపీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామి